ప్రభుత్వ జాగా.. వేసెయ్ పాగా!

- ప్రభుత్వ స్థలాల్లో దర్జాగా ఆక్రమణలు
- కనుమరుగవుతున్న కాలువ, ఏటిగట్లు
- చోద్యం చూస్తున్న అధికారులు



జాతీయ రహదారి 216 సుంకరపాలెంలో యానాం చెరువు గోడ చెంతన ఆక్రమణలు

తాళ్లరేవు: ప్రభుత్వ స్థలాలు ఖాళీగా కనబడితేచాలు అక్రమార్కులు ఆ స్థలాల్లో పాగా వేసి నిర్మాణాలు చేపట్టి దర్జాగా వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆర్అండ్బీ రహదారులు, జాతీయ రహదారుల చెంతన ఉన్న స్థలాలతోపాటు పంట కాలువ గట్లు, ఏటిగట్లను కూడా వదలకుండా అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారు. పలు ప్రధాన కూడళ్లలో ఈ ఆక్రమణల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. ఆక్రమణలను నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారి 216లోని పలు ప్రధాన కూడళ్లతోపాటు రహదారి చెంతన పలువురు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. తొలుత తాత్కాలికంగా చిన్నపాటి రేకుల షెడ్లను నిర్మించి, తరువాత ఆయా స్థలాల్లో పక్కా భవనాలను నిర్మించి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. పలువురు అధికారులు దాడులు చేసి అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నప్పటికీ, రాజకీయ పార్టీల నాయకుల అండదండలతో తిరిగి ఏర్పాటు చేసుకుంటున్నారు.

జాతీయ రహదారిని అనుకుని అక్రమ నిర్మాణాలు

మండల పరిధిలోని సుంకరపాలెం పంచాయతీలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న స్థలాల్లో ఇటీవల అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. కేంద్ర పాలిత ప్రాంతమైన యానాంకు తాగునీటి అవసరాల నిమిత్తం గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేటాయించిన 55 ఎకరాల స్థలాన్ని ఆనుకుని ఉన్న స్థలాన్ని ఆక్రమించుకుని పలువురు నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. అదే రహదారిలో ఊట కాలువ చెంతన ఇటీవల ఒక దుకాణాన్ని ఏర్పాటు చేసారు. కోరంగి పంచాయతీ సీతారామపురంలో సుబ్బారాయుని దిమ్మ ప్రాంతంలో ఇటీవలే ఒక రేకుల షెడ్డు వెలిసింది. కాకినాడ–యానాం రహదారి, జాతీయ రహదారి చెంతన ఉన్న ఆత్రేయ గోదావరి గట్టును సైతం అక్రమార్కులు వదలడం లేదు. ఖాళీ స్థలాలను ఆక్రమించుకుని భారీ స్థాయిలో షెడ్లు వేసి మరీ వ్యాపారాలు సాగిస్తున్నారు.

బెదరని అక్రమార్కులు

ఇటీవల పంచాయతీ అధికారులు ఆత్రేయ గోదావరి చెంతన ఉన్న పలు అక్రమ నిర్మాణాలను తొలగించి మొక్కలు నాటారు. అయినప్పటికీ అక్రమార్కులు ఏ మాత్రం బెదరకుండా అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. సుబ్బారాయుని దిమ్మ ప్రాంతంలో ఇటీవల షెడ్డు వేసిన వ్యక్తిపై స్థానిక పంచాయతీ వార్డు సభ్యుడు సంగాడి శ్రీనివాస్ ఫిర్యాదు చేయడం గమనార్హం. ఇలా ఉండగా మండలంలోని పంట కాలువగట్లు సంగతైతే చెప్పనవసరం లేదు. కాలువ గట్లను దర్జాగా ఆక్రమించుకుని కాలువలపైనే పలు నిర్మాణాలు చేపడుతున్నారు. పంట కాలువ గట్లను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారు. బహిరంగంగా రహదారులను, పంట, ఊట కాలువలు, ఏటిగట్లను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై పలువురు ప్రశ్నిస్తున్నారు. పలువురు అధికారులు కాసులకు కక్కుర్తిపడి పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను దర్జాగా ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు సాగిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని సర్వత్రా కోరుతున్నారు.


సుంకరపాలెం ఊటకాలువ చెంతన దుకాణం


సుబ్బారాయుని దిమ్మ జంక్షన్లో ఆత్రేయ గోదావరి గట్టును ఆక్రమించి నిర్మించిన రేకుల షెడ్డు


చింతాకులవారిపేటలో పంట కాలువపై నిర్మించిన దుకాణాలు

పేదల సొంతింటి కల సాకారం చేయండి



ముమ్మిడివరంలో ప్రచార జాతా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ముమ్మిడివరం: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదల సొంతింటి కల సాకారం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు డిమాండ్ చేశారు. మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 వరకు నిర్వహిస్తున్న రాజకీయ ప్రచార జాతా గురువారం ముమ్మిడివరం చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శీలం వెంకటేష్ నేతృత్వంలో ప్రచార జాతాను కేశనకుర్రులో జనిపెల్ల శివాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం పల్లెల్లో సెంటున్నర, పట్టణంలో సెంటు భూమి అర్హత పత్రాలు ఇచ్చిన లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం పల్లెలో మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్లు ఇళ్ల స్థలం కేటాయించాలన్నారు. సొంత స్థలం ఉండి ఇంటి పునాదులు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను స్థానిక ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో వనచర్ల విజయకుమార్, కుమ్మరి వెంకటేశ్వరరావు, జగడం పాపయమ్మ, సానబోయిన మనోహర్, పీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధంగా కూటమి నేతల తీరు

ప్రోటోకాల్ ఉల్లంఘనపై సర్పంచ్ ఆగ్రహం

ఉప్పలగుప్తం: విలసవిల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక స్థానిక సర్పంచ్కు నాయకుల తీరు కారణంగా అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ఉల్లంఘన జరుగుతోందని, స్థానిక ఎంపీటీసీ భర్త వేరే మండలంలో ఉన్న పీహెచ్సీలో ఉద్యోగిగా ఉంటూ గ్రామంలో అధికారిక, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని తనను అవమానిస్తున్నారంటూ సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి గురువారం ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామానికి ప్రథమ పౌరురాలిగా వ్యవహరిస్తున్న తనకు కూటమి నాయకులు, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలి భర్త తదితరులు కనీస సమాచారం అందించకుండా అధికారులపై అజమాయిషీ చెలాయిస్తూ బెదిరిస్తున్నారని సర్పంచ్ పేర్కొన్నారు. ఫ్యాన్ గుర్తుపై గెలిచి టీడీపీలో చేరిన ఎంపీటీసీకి అధిక ప్రాధాన్యతనిస్తూ సర్పంచ్కు సమాచారం ఇవ్వకుండా అధికారిక కార్యక్రమాలు, అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారని అన్నారు. తమ గ్రామంలో ఎంపీటీసీ భర్త వేరే మండలంలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ తమ గ్రామంలో పార్టీ, అధికారిక కార్యకలాపాల్లో పాల్గొని పెత్తనం చెయ్యటంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

కోనేరులో దేవేరులతో కొండలరాయుడి విహారం


అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం కోనేరులో స్వామి వారి తెప్పోత్సవం

శ్రీవారి తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు పోటెత్తిన భక్తులు

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లతో కలసి దేవస్థానం ప్రాంగణంలోని కోనేరులో శేష వాహనంపై గురువారం రాత్రి విహరించారు. కోనేరులో కొండలరాయుడు తన దేవేరులతో సాగిన తెప్పోత్సవాన్ని వేలాది మంది భక్తులు తిలకించి తరించారు. స్థానిక కిరాణా వర్తక హోల్సేల్ వ్యాపారి రేపాక సత్యనారాయణమూర్తి, నాగ పెద్దింట్లమ్మ దంపతులు, వారి కుటుంబీకుల ఆధ్వర్యంలో పువ్వులు, పండ్లు, తోరణాలతో అలంకృతమైన తెప్పపై స్వామి, అమ్మవార్లు కోనేరులో గంటన్నరకు పైగా విద్యుత్ దీపాల వెలుగుల్లో, ఆహ్లాదకర వాతావరణంలో విహరించారు. కోనేరు నాలుగు వైపులా గట్లపై వేలాది మంది భక్తులు కూర్చుని తెప్పోత్సవాన్ని తిలకించారు. దేవస్థానం ఉత్సవ కమిటీ ఛైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, ఈవో యర్రా వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు, అర్చకులు, పట్టణ ప్రముఖులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. తెప్పోత్సవం అనంతరం స్వామి వారి గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. సాయంత్రం 4.10 గంటలకు ముద్దుల భాస్కర నాగరాజు, నాగరత్నం దంపతులు స్వామి సన్నిధిలో పండిత సత్కారాలు వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శనను భక్తులు ఆసక్తిగా తిలకించారు. పట్టణ ప్రముఖులు నల్లా స్వామి, నల్లా పవన్కుమార్, మోకా వెంకట సుబ్బారావు, మాజీ కౌన్సిలర్లు దున్నాల దుర్గ, చిక్కాల ముద్దుబాబు పాల్గొన్నారు.

టీచర్ల కోసం విద్యార్థుల పడిగాపులు

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ శివారు పోర ఎంపీపీ పాఠశాలకు ఉదయాన్నే వచ్చిన విద్యార్థులు టీచర్ల కోసం బడి బయట పడిగాపులు కాసిన ఘటన గురువారం దర్శనమిచ్చింది. పల్లంకుర్రు పంచాయతీ పోర ఎంపీపీ పాఠశాలలో 50 మంది విద్యార్థులున్నారు. ఇందులో చాలామంది బడికి రావడం లేదు. ఈ పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఇద్దరు కాట్రేనికోన, ఇద్దరు కాకినాడ నుంచి పాఠశాలకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ఒకరు డిప్యుటేషన్పై కందికుప్ప పాఠశాలకు వెళ్లగా, ముగ్గురు ఉపాధ్యాయులు విధులకు హాజరుకావాల్సి ఉంది. వేసవి వంటి పూట సెలవులు కావడంతో ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు పని వేళలు ఉన్నా గురువారం టీచర్లు ఆలస్యంగా రావడం, తలుపులు తెరవకపోవడంతో బడికి వచ్చిన కొందరు విద్యార్థులు బయట మెట్లపై కూర్చున్నారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరామ్ను వివరణ కోరగా పరీక్ష పత్రాలు తీసుకుని రావడానికి మండల విద్యాశాఖ కార్యాలయానికి వెళ్లానని, అక్కడి సిబ్బంది నుంచి పరీక్షా పత్రాలు తీసుకొని వచ్చే సరికి ఆలస్యమైందన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

మామిడికుదురు: కోనసీమ జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణను ప్రారంభించారు. ఒక్కో కేంద్రంలో సుమారు 60 మంది విద్యార్థులకు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. మామిడికుదురు మండల పరిధిలోని మొగలికుదురు జెడ్పీహెచ్ స్కూల్లో ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నయినాల రఘురామయ్య తెలిపారు.

సొసైటీ సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న సొసైటీ సభ్యులు

రాజోలు: పొన్నమండ ఫీల్డ్ లేబర్ సొసైటీ సభ్యుడు ఉండ్రు మునలయ్య కుటుంబానికి సొసైటీ ద్వారా రూ.5 వేలు ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. ఇటీవల మునలయ్య మృతి చెందారు. ఆపదలో ఉన్న ఫీల్డ్ లేబర్ సొసైటీ సభ్యులకు ఆర్థికంగా తోడ్పాటును అందించేలా గతంలో తీర్మానం చేశామని సొసైటీ అధ్యక్షుడు కుసుమ రాజ్కుమార్ తెలిపారు. కార్యదర్శి నల్లి సూర్యం, ఉండ్రు రాజబాబు, కుసుమ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో రేపు జాబ్ మేళా

అమలాపురం రూరల్: జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 12వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి డి.హరి శేషు తెలిపారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జాబ్ మేళాను ప్రారంభిస్తారని తెలిపారు. సుమారు 12 కంపెనీల్లో 350 పైనే ఉద్యోగాలకు మానవ వనరుల రిసోర్స్ పర్సన్ ద్వారా నిరుద్యోగుల అర్హత ధ్రువపత్రాలు పరిశీలన, ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఇతర వివరాలు రాజేంద్ర ప్రసాద్ సెల్ నంబర్ 8247645389, లావణ్య సెల్ నంబర్ 9380808275 సంప్రదించాలని హరి శేషు కోరారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 1100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఆ శాఖ సీఐ కే కాత్యాయని తెలిపారు. విస్తృత దాడుల్లో భాగంగా ఆత్రేయపురం మండలం రాజవరం సమీప గోదావరిలో ప్లాస్టిక్ పీపాలతో ఉంచిన బెల్లపు ఊటను గుర్తించారు. వాటిని వెలికితీసి, వాటిలో ఊటను ధ్వంసం చేశారు. అలాగే వెలిచేరు గ్రామానికి చెందిన వీరమళ్ల వెంకటసత్యనారాయణ అనే వ్యక్తిని 5 లీటర్ల సారాతో అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో అమలాపురం ఏఈఎస్ జీ అమర్బాబు, ఎస్సై కే అన్నవరం ఎక్సైజ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

మొండెపులంకలో డెంగీ కేసు


గిడుగువారిపాలెంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్యాధికారులు

పి.గన్నవరం: మొండెపులంక గ్రామానికి చెందిన 60 ఏళ్ల వృద్ధురాలికి డెంగీ పాజిటివ్ నమోదయ్యిందని నాగుల్లంక పీహెచ్సీ వైద్యాధికారి వైవీ ప్రియాంక తెలిపారు. ఈనెల ఒకటో తేదీన వృద్ధురాలు అనారోగ్య కారణంగా కాకినాడ జీజీహెచ్లో చేరింది. ఈనెల 8న ఆమెకు రక్త పరీక్షలు చేయగా, డెంగీ పాజిటివ్గా నిర్ధారించారు. దీంతో అదే ఆస్పత్రిలో ఆమెకు చికిత్స అందిస్తున్నారని ప్రియాంక వివరించారు. ఈ నేపథ్యంలో కాకినాడ జీజీహెచ్ నుంచి వచ్చిన సమాచారంతో నాగుల్లంక పీహెచ్సీ ఆధ్వర్యంలో గురువారం మొండెపులంక గిడుగువారిపాలెం ప్రాంతంలో వైద్యాధికారులు టీమ్లు ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇళ్ల మధ్య ఏబేటు మందు స్ప్రే చేయించారు. పంచాయతీ ఆధ్వర్యంలో బ్లీచింగ్ చల్లి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు ఆ ప్రాంతంలో పర్యటించి దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. పీహెచ్సీ వైద్యాధికారి మహమ్మద్ రియాజ్ తున్నీషా బేగం, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎం.రాజశేఖర్, ఎంపీహెచ్ఈఓ ఎం.నాగరాజు, ఎంపీహెచ్ఎస్లు బీవీవీఎస్ఎస్ మూర్తి, కేసీహెచ్ మరియమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మల్చింగ్ విధానంతో కొబ్బరి తోటలకు మేలు

మామిడికుదురు: వేసవిలో కొబ్బరి తోటలకు మల్చింగ్ విధానంతో ఎంతో మేలు జరుగుతుందని అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చలపతిరావు సూచించారు. పాశర్లపూడిలంకలో ఆదర్శ రైతు పెదమల్లు నాగబాబు వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన ఉద్యాన శాస్త్రవేత్త కిరీటితో కలిసి గురువారం సందర్శించారు. సోలార్ ఇరిగేషన్ సిస్టం, అక్కడ ఏర్పాటు చేసిన అరపలు, తదితర విభాగాలను పరిశీలించారు. స్థానిక రైతులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. వేసవిలో కొబ్బరి తోటల్లో పదును ఆరిపోకుండా కొబ్బరాకులతో తోటలను కప్పి ఉంచాలన్నారు. కొబ్బరి తోటలకు సరిపడేలా నీటి తడులు పెట్టాలని సూచించారు. రైతులకు అవసరమైన దేశవాళీ, హైబ్రీడ్ కొబ్బరి మొక్కలు అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. దేశవాళీ రకం మొక్క రూ.100 వంతున ఒక్కొక్క రైతుకు వంద మొక్కలు విక్రయిస్తామన్నారు. హైబ్రీడ్ రకం మొక్క ఖరీదు రూ.350 అని ఒక్కొక్క రైతుకు 30 మొక్కలు అమ్ముతామన్నారు. మొక్కలు అవసరమైన రైతులు వెబ్సైట్లో అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకుని దాన్ని పూర్తి చేసి అంబాజీపేట కార్యాలయంలో అందించి మొక్కలు తీసుకు వెళ్లాలన్నారు. తెల్లదోమ ప్రభావం తగ్గుముఖం పట్టిందని చెప్పారు. సెప్టెంబరులో రైతుల కొబ్బరి పరిశోధనా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. తెల్లదోమ నివారణకు ఉచితంగా శిలీంద్రాలను అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఆత్మీయ కలయిక


మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డిని కలిసిన వెంకన్నాయుడు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిని అమలాపురానికి చెందిన పార్టీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం కలిశారు. ఇటీవల గుండె సంబంధిత వైద్యం చేయించుకున్న నాయుడిని ఈ సందర్భంగా జగన్మోహన్రెడ్డి పరామర్శించి ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు.

పటవలలో జాతీయ సర్వే దినోత్సవం

తాళ్లరేవు: పటవల పంచాయతీలో సర్వే, భూమి రికార్డుల శాఖ ఆధ్వర్యంలో గురువారం జాతీయ సర్వే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే దినోత్సవ ప్రాముఖ్యతను మండల సర్వేయర్ షఫీ ఉల్లా ప్రజలకు వివరించారు. పటవల పంచాయతీలో దాదాపుగా రీసర్వే పూర్తయ్యిందని, మరికొద్ది రోజుల్లో కోరంగి పంచాయతీలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏవీ రామరాజు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

అదనంగా అభివృద్ధి పనులు చేపట్టాలి

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశం గురువారం అసెంబ్లీ కాంప్లెక్స్లో నిర్వహించారు. కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే నజీమ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యేలు అర్ముగం, పి అంగళ, ఎల్ లక్ష్మీసుందరం, జి నెహ్రూ, ఆర్ సెంథిల్కుమార్, ఎల్ సంపత్, ప్రకాష్కుమార్, వీపీ రామలింగం, ఎమ్ శివశంకరన్ పాల్గొన్నారు. ఆర్థికశాఖ కార్యదర్శి ఆసిష్ మోదోరా, స్థానిక పాలనా కార్యదర్శి కేశవన్, డీడీ సౌందరాజన్ రత్నా, మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు. పుదుచ్చేరి వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యే ల్యాడ్ నిధులతో చేపట్టిన పనులతో పాటు అదనంగా అభివృద్ధి పనులు చేపట్టేలా నిబంధనల్లో మార్పు తీసుకురావాలని కమిటీ చైర్మన్ నజీమ్ కోరారు.

ఎస్కేబీఆర్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

అమలాపురం రూరల్: అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాలలో దివీస్ ల్యాబొరేటరీస్ హైదరాబాద్ సంస్థలో హెచ్ఆర్ పూర్ణప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం బీఎస్సీ, కెమిస్ట్రీ, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్కేబీఆర్ కళాశాల చెందిన 80 మంది విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ ఎ.శరత్బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, పాలమండల సభ్యుడు డీఎస్ఎన్.రాజు, యూజీ. కళాశాల ప్రిన్సిపాల్ నూకల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఫలితాలు త్వరలో తెలియజేస్తామని పూర్ణప్రసాద్ తెలిపారు.

జల్ జీవన్ మిషన్ పనుల ప్రగతిపై సమీక్ష


జల జీవన్ మిషన్ పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ హరీష్ మాథుర్

అమలాపురం టౌన్: జల జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో చేపట్టిన పనులపై గ్రామీణ నీటి సరఫరా శాఖ జిల్లా ఉన్నతాధికారులతో అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం సమీక్షించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ రక్షిత మంచి నీరు అందించే దిశగా సాగుతున్న ఈ పనుల వేగవంతంపై ఎంపీ అధికారులతో మండలాల వారీగా చర్చించారు. పనులను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. సమీక్షలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డితో పాటు ఈఈ, డీఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

పీసీఎస్ ఆఫీసర్లకు ఐఏఎస్ హోదా

యానాం: పుదుచ్చేరి, మాహే, యానాం, కారైకల్ తదితర ప్రాంతాల్లో పుదుచ్చేరి సివిల్ సర్వీసెస్(పీసీఎస్) కేడర్ అధికారులుగా వివిధ హోదాల్లో సేవలు అందించిన నలుగురు సీనియర్ అధికారులకు గురువారం కేంద్ర ప్రభుత్వం ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) కేడర్ కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా ప్రస్తుతం పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి పి ప్రియదర్శిని, వివిధ శాఖల్లో పనిచేస్తున్న వైఎల్ఎన్ రెడ్డి, ఎల్ మహ్మద్ మనసూర్, పీటీ రుద్రగౌడకు ఐఏఎస్ కేడర్ కల్పించారు. ఈ మేరకు మినిస్ట్రీస్ ఆఫ్ పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్ అండ్ పెన్షన్స్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో వీరు ఏజీఎంయూటీ (అరుణాచల్ప్రదేశ్, గోవా, మిజోరాం, యూనియన్ టెరిటరీల్లో ఏ ప్రదేశాల్లోనైనా పనిచేయాల్సి ఉంటుంది. అనంతరం వీరు ఎల్జీ కైలాషనాథన్, సీఎం రంగసామిని మర్యాదపూర్వకంగా కలిసారు

ఎమ్మెల్యే అశోక్ను కలిసిన ఎస్సై పునీతరాజా

యానాం: యానాం పోలీస్స్టేషన్ నూతన ఎస్సైగా నియమితులైన పునీతరాజా గురువారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్అశోక్ను మర్యాదపూర్వకంగా కలిసారు. పుదుచ్చేరి కోస్టల్ పోలీస్స్టేషన్లో ఎస్సైగా ఉన్న పునీతరాజా ఇటీవలి యానాం స్టేషన్కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయడం ద్వారా అందరిని కలుపుకుని వెళుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్తో ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.

సాగు నీటి సమస్యను పరిష్కరించండి

తాళ్లరేవు: దాళ్వాలో నీటి ఎద్దడి లేకుండా పూర్తిస్థాయిలో సాగునీటిని సరఫరా చేసినందుకు ఇరిగేషన్ అధికారులను రైతులు ఘనంగా సత్కరించారు. పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో నూకాలమ్మ ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ పోచారావు, ఏఈ అనూష, డీసీ చైర్మన్ వేగేశ్న భాస్కరరాజును ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేసారు. ఏటా వరి పంట పొట్ట దశలో సాగు నీరందక దిగుబడి తగ్గుతోందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో డీసీ వైస్ చైర్మన్ మొగలితుర్తి శ్రీనివాసరావు, నీటి సంఘాల అధ్యక్షుడు అల్లూరి రామకృష్ణంరాజు, ధూళిపూడి గోపి, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

తాళ్లరేవు: గాడిమొగ సెక్టార్ పరిధిలోని చినబొడ్డు వెంకటాయపాలెం, పెద్దబొడ్డు వెంకటాయపాలెంలోని అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ వి.మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్వైజర్ నళిని పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా కేంద్రాల అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మాజీ అధ్యక్షుడు కృష్ణంరాజు మృతి



ఐ.పోలవరం: యూటీఎఫ్ ఐ.పోలవరం మండలం శాఖ మాజీ అధ్యక్షుడు పొత్తూరి రామకృష్ణంరాజు (74) మృతి చెందారు. అనారోగ్య కారణాల వల్ల గురువారం ఆయన మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కృష్ణంరాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కృష్ణంరాజు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా యూటీఎఫ్ ఉపాధ్యక్షుడుగా సేవలందించారు. కృష్ణంరాజు కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

యల్లారమ్మకు కుంకుమ పూజలు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలోని యల్లారమ్మ ఆలయంలో 117వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు ఆచరించారు. అనంతరం గ్రామోత్సవం, అన్నసమారాధన నిర్వహించారు.

షార్ట్సర్క్యూట్తో గృహోపకరణాల దగ్ధం

యానాం: విద్యుత్ షార్ట్సర్క్యూట్తో పట్టణ పరిధిలో జీఎస్ నాయుడు కాలనీ, నవాజ్ కాలనీల్లో పలు నివాసాల్లో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. గురువారం మధ్యాహ్నం విద్యుత్ మెయిన్లైన్ తీగలు కలిసిపోవడంతో షార్ట్సర్క్యూట్ జరిగి పలు గృహాల్లో పనిచేస్తున్న ఏసీలు, ఫ్రిజ్లు, కంప్యూటర్లు, ఫ్యాన్లు, చార్జింగ్లో ఉన్న సెల్ఫోన్, స్మార్ట్ టీవీలు దగ్ధమయ్యాయి. ఆ ప్రాంతంలోనే నివసిస్తున్న ఓ వ్యక్తి రూ.1.40 లక్షలతో గురువారం కొత్త కంప్యూటర్ కొనుగోలు చేసి ఉపయోగిస్తుండగా పొగలు వచ్చి కాలిపోయిందని తెలిపారు. జీఎస్ నాయుడు, నవాజ్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆ రెండు కాలనీవాసులు అంధకారంలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేసారు. విద్యుత్శాఖ తీవ్ర నిర్లక్ష్యం కారణంగానే రూ.లక్షల విలువైన వస్తువులు దగ్ధమయ్యాయని వారే ఈ ఘటనకు బాధ్యత వహించాలన్నారు. దీనిపై విద్యుత్ ఏఈ లంక నక్షత్రం మాట్లాడుతూ విద్యుత్ మెయిన్లైన్ తీగలను కాకులు కలపడం వల్లే విద్యుత్షార్ట్ సర్క్యూట్ జరిగిందని వివరణ ఇచ్చారు. విద్యుత్ సిబ్బంది స్పందించి చెట్ల ఆకులు తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఉప్పలగుప్తం: మండలంలోని 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కోసం పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ కె.రాంబాబు గురువారం తెలిపారు. ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, కూనవరం, కిత్తన చెరువు, మునిపల్లి, సన్నవిల్లి, పెద్దగాడవిల్లి, చిన్నగాడవిల్లి, వానపల్లిపాలెం, ఎన్.కొత్తపల్లి, రాఘవులుపేట పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, చల్లపల్లి, గోపవరం, సరిపల్లి, ఎస్ యానం, వాసాలతిప్ప, నక్కా రామేశ్వరం గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన వివరించారు.

తాళ్లరేవు మండల పరిధిలో..

తాళ్లరేవు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్శాఖ ఈఈ ఎస్.ఉదయ్భాస్కర్ తెలిపారు. జి.వేమవరం, కొత్తూరు పాతకోరంగి, తాళ్లరేవు, కోరంగి, సీతారామపురం, సీబీవీ పాలెంలో విద్యుత్కు అంతరాయం కలుగుతుందన్నారు.

పేరూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో..

అమలాపురంరూరల్: పేరూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అమలాపురంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు.